ప్రజాశక్తి

మంగళవారం 20 డిసెంబర్ 2022 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





నేడు దర్శికి సిఎం జగన్





సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

- ఎమ్మెల్యే మద్దిశెట్టి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరు
- పంటనష్టాలపై సిఎం వద్ద జిల్లా నేతలు ప్రస్తావిస్తారా? లేదా?

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నేడు దర్శికి రానున్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కుమా రుడి వివాహ రిసెప్షన్‌కు ఆయన హాజరవుతు న్నారు. దర్శిలో భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం వివాహ రిసెప్షన్ అయినా రాజకీయంగానే అక్కడ సమీకరణలు..ఆహ్వానాలు కనిపించాయి. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని తీసు కున్నారు. సిఎంను దర్శికి రప్పించేందుకు ప్రత్యేకంగా ఆయన ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారనే చర్చ కూడా లేక పోలేదు. ఆయన రాజకీయ భవిష్యత్‌కూ సిఎం జగన్ పర్యటన కీలకంగా మారిందనే విశ్లేషణలూ వినిపిస్తున్నాయి. దర్శిలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిణామాలు.. పరిస్థితులు పాలకపక్షంలోనే కొంత గందరగోళ పరిస్థితినే తెరపైకి తెచ్చాయి. పార్టీలో చాలాకాలంగా రెండు గ్రూపులు కొనసాగుతున్నాయి. ఆధిపత్య పోరు నడుస్తోంది. ఉనికి కోసం పోరాటాలు సాగుతున్నాయి. ఏదేమైనా ఇక్కడ సిఎం జగన్ పర్యటన నేతల భవిష్యత్ రాజకీయ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తుందా? లేదా? అనేదీ చూడాలి.

ఇక జిల్లాలో సిఎం పర్యటన అనగానే ఆందరి దృష్టి ▶ 2లో

● ఘనంగా సెమీ క్రిస్మస్ (హై టీ) వేడుకలు



ప్రకాశం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హై టీ (సెమీ క్రిస్మస్) కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు కలెక్టరేట్

తడిసిన ప్రతి గింజనూ కొంటాం..

- నష్టపోయిన రైతులందరికీ అండగా ప్రభుత్వం
- అవసరమైన రైతులకు మరోసారి విత్తనాలు పంపిణీ
- పంటల పరిశీలనలో మంత్రి డాక్టర్ సురేష్



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-పెద్దారవీడు

మాండూస్ తుపాను కారణంగా రైతన్నలకు అపార నష్టమే జరిగిందని, తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. తుపాను కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు పెద్దారవీడు మండలంలోని గొబ్బూరు, తోకపల్లి గ్రామాల్లోని పంట పొలాలను మంత్రి డాక్టర్ సురేష్ సోమవారం సందర్శించారు. దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని రైతులతో మాట్లాడారు. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, తుపానుతో నోటికి అందివచ్చిన దిగుబడులు రాకుండా పోయాయని పలువురు రైతులు మంత్రి డాక్టర్ సురేష్ ఎదుట వాపోయారు. మిర్చి ఎకరంపై పెట్టుబడి రూ.లక్ష తగ్గకుండా పెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం మిర్చి రైతులకు పెట్టుబడులు రావన్నారు. నల్లి తెగులుతో సగం దెబ్బతినగా మిగిలిన సగం పంట తుపానుతో పనికిరాకుండా పోయిందన్నారు. పంట నష్టంపై ఉద్యాన శాఖ, వ్యవసాయ అధికారులు ఆదిరెడ్డి, బుజ్జిబాయిలతో మంత్రి డాక్టర్ సురేష్ చర్చించారు. ఏ స్థాయిలో నష్టం ▶ 2లో

నేడు దర్శికి సిఎం జగన్

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకంగా అక్కడే ఉంటుంది. ప్రస్తుతం అనేక సవాళ్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన వచ్చే కార్యక్రమం అధికారికంగా లేదు. అయితే సిఎం స్థాయిలో ఎక్కడకు ఏ పనిమీద వెళ్లినా ప్రాధాన్యత ఉంటుంది. జిల్లాకు వస్తున్న తరుణంలో జిల్లా నేతలు స్పందించి జిల్లాలోని కీలకమైన సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోతేనే రైతులకు మేలు జరుగుతుంది. అనేక సమస్యలున్నాయి. కొద్దిసేపు ఆయన వద్ద ప్రస్తావిస్తారనే ఆశాభావంతో జనం ఉన్నారు.

జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అధికారికంగానే ప్రాథమిక అంచనాల మేరకు 67 వేల ఎకరాల్లో మిర్చి, వరి, మినుము,శనగ, బొబ్బర్లు తదితర పంటలు పోయాయి. పొగాకు 80 శాతానికి పైగా పోయింది. 25 వేల ఎకరాల్లో ఎందుకూ పనికిరాకుండా ఉంది. రైతులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కేంద్రం పరిధిలో ఉన్న పొగాకు రైతులకు కనీసం భరోసా కూడా కనిపించడం లేదు. పరిహారం అందే జాబితాల్లో ఈ పంట లేదు. రుణాలు రీషెడ్యూల్ కోరుతున్నారు. వడ్డీ లేకుండా ఈ ప్రక్రియ చేయాల్సి ఉంది. కొత్త రుణాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ అంశం రాజకీయాలకు అతీతంగా ఉంది. మంత్రి, ఎమ్మెల్యేలు సిఎం జగన్ దృష్టికి ఈ సమస్యలను నివేదిస్తేనే ప్రాధాన్యత ఉంటుంది.

వచ్చే ఏడాది వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించాల్సి ఉంది. అయితే పునరావాసం కోసం ఇంతవరకూ నిధులు రాలేదు. ప్యాకేజీల కోసం రూ.1400 కోట్ల వరకూ రావాలి. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. పునరావాసమే మిగిలింది. ఇప్పటికీ ముంపు గ్రామాలు అక్కడే ఉన్నాయి. నిర్వాసితులు అక్కడ నుంచి తరలి రావాలంటే ముందు వారికి ప్యాకేజీలు ఇవ్వాలి. కాలనీల్లో ఇళ్లు కట్టుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఈ ప్రక్రియ మాత్రం వేగంగా లేదు. సిఎం దృష్టికి తీసుకుపోవాల్సిన అంశాల్లో ఇదొకటి కీలకంగా ఉంది.

గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు దెబ్బతిన్నాయి. మరమ్మతులు ముందుకు సాగడం లేదు. ఈ ఏడాది ఈ ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందే పరిస్థితి లేదు. వర్షాలు ఉన్న పంటలను కూడా ముంచాయి. గుండ్లకమ్మ ప్రాజెక్టుపై పూర్తి నిర్లక్ష్యం ఉంది. జిల్లా పరిషత్‌లోనూ తీవ్రంగానే చర్చ సాగింది. దీనిపైనా దృష్టి సారించాల్సి ఉంది. మిగతా సాగునీటి ప్రాజెక్టులు అన్నీ పెండింగులోనే ఉన్నాయి. పనులు ముందుకు సాగడం లేదు.

నియోజకవర్గాల్లో చేసిన పనులకు బిల్లులు రాలేదనే చర్చ నడుస్తూనే ఉంది. కొత్తగా నిర్మించిన భవనాలకు బిల్లులు ఇవ్వలేదు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీల్లోనూ నిధుల్లేవు. కొత్తగా చేపట్టే పనులు కూడా లేవు. చేసిన పనులకే బిల్లులు రాకపోవడంతో దిగాలుగా ఉన్నారు. సర్పంచులు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

టిడ్కో ఇళ్లపై సందిగ్ధంగానే ఉంది. నాలుగేళ్లయినా వాటిపై ఏ నిర్ణయం తీసుకోలేదు. పూర్తిచేసి అప్పగించే ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. జగనన్న కాలనీల్లోనూ ఇళ్ల నిర్మాణం అనేక అవాంతరాల నడుమ కొట్టుమిట్టాడుతోంది. పనులు మాత్రం వేగంగా లేవు. ఈ నెలలోనే ఇళ్ల ప్రవేశం కూడా వాయిదా పడాల్సి వచ్చింది. అన్ని రకాల ధరలు పెరగడమే ఇందుకు కారణం.

నాగరాజుకు అంతర్జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్ : మండల పరిధిలోని ముత్తాయి పాలెం గ్రామానికి చెందిన ఫొటో గ్రాఫర్ నాగరాజుకు అంతర్జాతీయ పుర స్కారం దక్కింది ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి లార్ట్ ఫొటోగ్రాఫిక్, ఫ్రాన్స్ వారు ఇటీవల ప్రకటించిన అంతర్జాతీయ పురస్కారాల్లో నాగరాజు ఎక్సిలెన్సు ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డెల్ ఆర్ట్ ఫొటోగ్రాఫిక్ హానర్ అవార్డు లభించింది. నాగరాజు కలర్ విభాగంలో పంపిన ఫొటోలకు న్యాయనిర్ణేతలు ముగ్ధులై అవార్డుకు ఎంపిక చేశారు. డిస్టెన్స్ ఇన్‌చార్జి డిక్వాస్ బెల్ మానే ఇమెయిల్ ద్వారా నాగరాజుకు అభినందనలు తెలిపారు.



ఎంపీ మోపిదేవికి బాధితుల వినతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండల పరిధిలోని పొన్నపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కొంతమంది దళారులు తమ భూములకు నకిలీ పత్రాలు సష్టించి స్వాధీనం చేసుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావుకు కోరారు. సోమవారం పొన్నపల్లి గ్రామానికి వచ్చిన మోపిదేవికి గ్రామ పెద్దలు ప్రజలు కలిసి సమస్యను వివరించారు. తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములకు కొంతమంది నకిలీ ధ్రువ పత్రాలు సష్టించినట్లు తెలిపారు.వాటి ఆధారణంగా రిజిస్ట్రేషన్ సైతం చేయించుకున్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటామని ఎంపీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, నాయకులు పైనం ఏడుకొండలు రెడ్డి, కామినేని కోటేశ్వరరావు, చీరాల ప్రసాద్ రెడ్డి, లంక వీరభాస్కర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవికి వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి- అద్దంకి

శ్మశాన వాటికలో ముళ్ల చెట్లు పెరగాయని, దీంతో గ్రామంలో ఎవరైనా మృతిచెందితే అక్కడ అంత్యక్రియలు నిర్వహించేందుకు అవస్థలు పడతున్నామని జార్లపాలెం గ్రామస్తులు స్పందన కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ మల్లికార్జున, తహశీల్దారు సుబ్బారెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శ్మశాన వాటికకు సుమారు 50 సెంట్ల స్థలం ఉన్నట్లు తెలిపారు. అందులో పిచ్చి, తుమ్మ చెట్లు పెరిగినట్లు తెలిపారు. దీంతో అక్కడ అంత్యక్రియలు నిర్వహించేందుకు వీలు కాక రోడ్డు మార్జిన్‌లో అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో శ్మశాన వాటికల్లో పెరిగిన పిచ్చి, తుమ్మచెట్లను తొలిగించి అభివృద్ధి చేయాలని కోరారు. అదేవిధంగా శ్మశాన వాటికను సర్వే చేసి చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఈదర బ్రహ్మారెడ్డి, చల్ల గోవిందరెడ్డి, ధూళిపాళ్ల సుబ్రహ్మణ్యం, బోదాటి భార్గవ్, డి.పెద్దన్న, రాధాకష్ణమూర్తి, వీరాస్వామి, శ్యామల రామిరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివజ్యోతి

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో డిఆర్ఒ అధ్యక్షతన సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ బాధితులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పట్ల అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. ప్రజలు క్షేమంగా ఉండడానికి ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్దేశాన్ని తెలుసుకొని అధికారులు ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలన్నారు. తన పరిధిలోని సమస్యలకు డిఆర్ఒ తక్షణమే పరిష్కారం చూపారు. తన పరిధిలో లేని అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపారు. ఈ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

రోడ్డు సౌకర్యం కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్ ముక్తిమాతలపాడు గ్రామం నుంచి నేషనల్ హైవే-16, కిమ్స్ హాస్పిటల్‌కి వెళ్ళటానికి సౌకర్యవం తమైన రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిఆర్ఒ ఓబులేసుకు స్థానికులు వినతిపత్రం ఇచ్చారు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

భట్టిప్రోలు : సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఇటీవల ఆకలితో ఆత్మహత్య పాల్పడిన చేనేత కార్మికుడు కలూరి కష్ణమూర్తి (53) కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, బట్టు నగమల్లేశ్వరరావు, దీపాల సత్యనారాయణ డిమాండ్ చేశారు.సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

సెమీక్రిస్మస్ వేడుకలు

సంతమాగులూరు : స్థానిక పభుత్వ జూనియర్ కాలేజీలో సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకు కట్ చేసి అందిరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ టిజె. చంద్రశేఖర్, అఖిలభారత వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు బండారు పుల్లారావు, పాస్టర్ తిమోతి, ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు బాలయ్య పాల్గొన్నారు.

తడిసిన ప్రతి గింజనూ కొంటాం..

(మొదటిపేజీ తరువాయి)

వాటిల్లిందో తెలుసుకున్నారు.

అనంతరం మంత్రి డాక్టర్ సురేష్ విలేకరులతో మాట్లాడారు. మాండూస్ తుపాను కారణంగా వరి, మిర్చి, పొగాకు, పప్పు శనగ, మినుము తదితర పంటలకు తీరని నష్టం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించండతో పంటలు ఏ స్థాయిలో దెబ్బతిన్నాయో అర్థం అవుతోందన్నారు. ఈ పాటికే తుపానుతో నష్టపోయిన పంట నివేదికలను అధికారుల ద్వారా తెప్పించుకోవడం జరిగిందన్నారు. రైతులను ఆదుకునేందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇ-క్రాప్ చేసిన పంట దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీతో ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. నెల లోపు సాగుబడిలో పంటలు దెబ్బతిని ఉంటే ఆ పంటలు మరోసారి సాగు చేసుకునేందుకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 35 మండలాల్లో 67వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని ప్రాథమిక నివేదికలు తేలిందన్నారు. ప్రతి రైతుకు సాయం అందేలా చూస్తామన్నారు. అత్యధికంగా కనిగిరి నియోజకవర్గంలో 37 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఆ తరువాత మార్కాపురం నియోజకవర్గంలో నష్టం జరిగిందన్నారు.

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని వెల్లంపల్లిలో కూడా తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాన్ని ఈ నెల 22న ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సురేష్ చెప్పారు. మిర్చి రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఇది రైతు ప్రభుత్వమని, ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. మంత్రి డాక్టర్ సురేష్ పర్యటనలో పెద్దారవీడు ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య, జడ్‌పిటిసి యేర్వ చలమారెడ్డి, వైసిసి మండల కన్వీనర్ పాలిరెడ్డి క్రిష్ణారెడ్డి, వైస్ ఎంపిపి గుండారెడ్డి యోగమ్మ-వెంకటేశ్వరరెడ్డి, గొబ్బూరు సర్పంచి అంగిరేకుల ఆదినారాయణ, తోకపల్లి సర్పంచి జిల్లెల మల్లేశ్వరి, జి.రమేష్, ఎంపిటిసిలు దూదేకుల పకీరయ్య, డిప్యూటి తహశీల్దారు సిహెచ్ రాజేష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

- రూ.4,55 లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి

ప్రజాశక్తి- చీరాల

చెడు వ్యసనాలకు బానిసై ఈజీ మనీ కోసం అలవాటు పడి తీరప్రాంతాలకు వచ్చే పర్యాటకులను టార్గెట్ చేసి వారి వాహనాలలో భద్రపరిచే నగదు, బంగారు ఆభరణాలను చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.44.55 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చీరాల డిఎస్‌పి శ్రీకాంత్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం... చీరాల మండలం వాడరేవు తీరప్రాంతంలో పలు వాహనాల్లో ఉంచిన బంగారు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీకాంత్

ఆభరణాలు, నగదు, చరవాణులు అపహరణకు గురయ్యాయని బాధితులు ఈపూరుపాలెం, వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈపూరుపాలెం పోలీసులు ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులకు అందిన సమాచారం మేరకు చోరీలకు పాల్పడుతున్న కాకినాడ తునికి చెందిన డి. అంకరాజు, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ సల్మాన్‌ను అరెస్టుచేశారు.వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్, సెల్ ఫోన్లు, బంగారు ఆభరణాలు, నగదు మొత్తం రూ.4.55 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చీరాల, వేటపాలెం, పాయకరావుపేట ప్రాంతాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడ్డారు. ఈపూరుపాలెం ఎస్ఐ జనార్ధన్, సిఐ మల్లికార్జున రావు సహకారంతో డిఎస్‌పి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను అరెస్టు చేశారు. చోరీ కేసును చేధించిన రూరల్ సిఐ ఎ.మల్లికార్జునరావు, ఈపూరుపాలెం ఎస్ఐ జనార్ధన్, పోలీసు సిబ్బందిని శ్రీకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

- మిర్యాలగూడలో ఘటన
- శింగగరాయకొండలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కనుమళ్ల గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు (32) అనే వ్యక్తి బాతులను మేపేందుకు తెలంగాణా రాష్ట్రంలోని మిర్యాలగూడలోని త్రిపురారం గ్రామానికి వెళ్లాడు. నగదు విషయమై ఆదివారం జరిగి తోపులాటలో కిందపడటంతో వెంకటేశ్వర్లు మతిచెందాడు. మతదేహాన్ని స్వగ్రామైన కనుమళ్ల గ్రామానికి తీసుకొచ్చారు. అందరూ బంధువులు కావడంతో రాజీ కోసం ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలు విఫలం కావడంతో 100కు ఫోన్ చేశారు. శింగరాయకొండ పోలీసులు సోమవారం కనుమళ్ల గ్రామానికి వెళ్లారు. కట్టా వెంకటేశ్వర్లు మతి చెందాడు కాబట్టి ఫిర్యాదు ఇవ్వాలని సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ ఫిరోజా ఫాతిమా కోరారు. అందుకు వారు అంగీకరించేలేదు. చివరకూ పోలీసులు మతుడి భార్య అంకమ్మ నుంచి పూర్తి సమాచారం తెలుసుకున్నారు. రూ. 37 వేల నగదు విషయంలో వినుకొండకు చెందిన పేరం శివయ్య అనే వ్యక్తికి తన భర్త వెంకటేశ్వర్లు మధ్య గొడవ జరిగినట్లు తెలిపారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో తన భర్త వెంకటేశ్వర్లు కింద పడటంతో మృతిచెందినట్లు తెలిపింది. దీంతో పోలీసులు ఫిర్యాది అంకమ్మ దగ్గర సమాచారం తీసుకొని మతదేహాన్ని ఒంగోలు రిమ్స్ కు తరలించి జీరో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి మిర్యాలగూడకు పంపారు.

ప్రాధాన్యతా క్రమంలో పనులు : బాచిన

ప్రజాశక్తి -బల్లికురవ

అభివద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నట్లు రాష్ట్ర శాప్ నెట్ ఛైర్మన్, వైసిపి అద్దంకి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బాచిన కష్ణ చైతన్య తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివద్ధి పనులను సోమవారం ప్రారంభిం చారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత నక్కబొక్కలపాడు గ్రామ పరిధిలోని సంతమగులూరు ఆర్అండ్‌బి రోడ్డు నుంచి గంగమ్మ గుడి వరకూ నిర్మించతలపెట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బల్లికురవ లోని ఎస్‌టి కాలనీలో నిర్మించిన సిసిరోడ్డు, కల్వర్టును ప్రారంభించారు.ఎస్‌సి కాలనీలోని కమ్యూనిటీ హాల్ భవ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి జడ్‌పిహెచ్ఎస్ ఆడిటోరియం వరకూ సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపిపి బడుగు శ్రీలక్ష్మి, ఎఇ హనుమంతరావు , ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు



శంకుస్థాపనలో బాచిన కృష్ణ చైతన్య

కారు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

కారు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఆరుంభాక గ్రామ శివారు ప్రాంతంలో సోమవారం చోటు చేసకుంది. చెరుకుపల్లి వైపు నుంచి చందోలు వైపు వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక వైద్యశాలకు తరలించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : రావి

ప్రజాశక్తి-కారంచేడు

పేదల సంక్షమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని వైసిపి పర్చూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి రావి రామనాథం బాబు తెలిపారు. కారంచేడు-2 గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత వైసిపి నాయకులు, కార్యకర్తలు రామనాథం బాబుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రావిరామనాథం బాబు గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలు వివరించారు. అదేవిధంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను రామనాథం బాబు దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన రామనాథం బాబు అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న రామనాథం బాబు



మాట్లాడుతున్న బీసీ కమిషన్ మెంబర్ అవ్వారు ముసలయ్య

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎపి బీసీ కమీషన్ సభ్యులు అవ్వారు ముసలయ్య

ప్రజాశక్తి- చీరాల

నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవసరమైన శిక్షణను అందించాలని లక్ష్యంతో వీవర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆర్గనైజేషన్ కషి చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు,ఎపి బీసీ కమీషన్ సభ్యులు అవ్వారు ముసలయ్య తెలిపారు. తన స్వగహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముసలయ్య మాట్లాడారు. ఎన్ఎన్‌సి అకాడమీ వారి అనువజ్ఞులైన ఫ్యాకల్టీతో ఎస్ఐ మరియు కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు దీన్ని సద్వినియోగం చేసు కోవాల న్నారు. భోజన, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులు ఈ నెల 21 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, మైనారిటీ అభ్యర్థులకే కాకుండా అర్హులైన ఇతర సామాజిక వర్గీయులు కూడా శిక్షణకు హాజరు కావచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 9247203805, 8500002799 లేదా 038592 294003 సెల్ నంబర్లల్లో సంప్రదించాలన్నారు.

సొసైటీ సిఇఒ ఆత్మహత్య

ప్రజాశక్తి-పంగులూరు



సుధాకర్(ఫైల్)

పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామ, సహకార వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) సిఇఒ ఎండ్లూరి సుధాకర్(35) పురుగుమందు తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండ మంజులూరు గ్రామానికి చెందిన ఎండ్లూరి సుధాకర్ 2014 నుంచి సొసైటీ సిఇఒగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని జగనన్న కాలనీలో సమీపంలోని తన సోదరుడి ఇంటి సమీపంలో సుధాకర్ పురుగుమందు తాగాడు. అనంతరం తన తమ్ముడికి ఫోన్ చేసి పిల్లలు, మీ వదిన జాగ్రత్త అని చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు సుధాకర్ వద్ద వచ్చి కారులో మేదరమెట్ల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుధాకర్ మృతిచెందినట్లు నిర్ధారించారు. మతుడు సుధాకర్ మదుస్వభావి, ఎవరితోనూ గొడవ పెట్టుకోడని ,ఇంట్లో కూడా చాలా సౌమ్యంగా ఉంటాడని గ్రామస్తులు చెప్పారు. ఉద్యోగ రీత్యా కూడా రైతులతోనూ మిగతా ప్రజలతోనూ కలిసి మెలిసి ఉంటాడని, ఎవరితోనూ వైరం తెచ్చుకోడని వారు తెలిపారు. సుధాకర్ కు భార్య, ఏడు, ఆరు, సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



గాయపడిన షేక్ మస్తాన్ వలి

యువకుడికి తీవ్ర గాయాలు

మార్టూరు రూరల్ : స్పీడ్ బ్రేకర్ల వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మార్టూరు సమీపంలోని అమరావతి మిల్లు వద్ద సోమవారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వలపర్ల గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి అమరావతి మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నారు. రోజులాగే విధులు ముగించుకొని బైకుపై మార్టూరు వస్తున్నారు. ఈ క్రమంలో సర్వీస్ రోడ్డులోనున్న స్పీడ్ బ్రేకర్‌ను గమనించక పోవడంతో బైక్ అదుపు తప్పి బోల్తాకొట్టింది. దీంతో మస్తాన్ వలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మస్తాన్‌వలిని రాష్ట్ర ముస్లీం మైనారిటీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మీరాబాబు, బాపట్ల పార్లమెంటరీ ముస్లీం మైనారిటీ సంఘం అధ్యక్షుడు గడ్డం మస్తాన్ వలి, జిల్లా కార్యదర్శి షేక్ జాఫర్ అలీ వైద్యశాలలో పరామర్శించారు.

గాయపడిన వ్యక్తి మృతి

శింగరాయకొండ : శింగరాయకొండ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి గ్రానైట్ రాళ్ల లారీ కారుని ఢీకొన్న ఘటనలో మరో వ్యక్తి మృతి చెందాడు. చీమకుర్తి నుంచి రామాయపట్నం వెళ్తున్న గ్రానైట్ రాళ్ల లారీ కారును ఢీ కొట్టి బోల్తా కొట్టిన విషయం తెలిసిందే. ప్రమాదంలో గాయపడిన హఫీద్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన మరో ఇద్దరిని ఒంగోలు నుంచి గుంటూరుకు తరలించారు. వారిలో కొక్కిలిగడ్డ శివశంకర్ అనే యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎఎస్ఐ షేక్ మహబూబ్ బాషా మతదేహాన్ని పరిశీలించారు.

మాలక్ష్మమ్మకు నివాళి

ప్రజాశక్తి- పంగులూరు



మా లక్ష్మమ్మ.(ఫైల్)


సిపిఎం రాష్ట్ర నాయకులు నాగబోయిన రంగారావు అత్తమ్మ కామేపల్లి మాలక్ష్మమ్మ (97) సోమవారం మధ్యాహ్నం మరణించింది. మాలక్ష్మమ్మ ఇంకొల్లు మండలం, చిననక్కల పాలెం గ్రామం వాసి. ఆమెకు రామాంజమ్మ ఒక్కతే కూతురు. రామాంజమ్మకు నాగబోయిన రంగారావుతో వివాహం జరిపించారు. మాలక్ష్మమ్మ వృద్ధాప్యం కారణంగా అల్లుడు నాగబోయిన రంగారావు ఇంట్లో ఉంటుంది. ఆమె గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. మా లక్ష్మమ్మ భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, తలపనేని రామారావు, మండల అభివద్ధి కమిటీ అధ్యక్షుడు రాయని వెంకట సుబ్బారావు, జనకవరం సర్పంచి తలపనేని ఆంజనేయులు, టిడిపి నాయకులు మేడ సుబ్బారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



సత్కారం అందుకుంటున్న వైద్యులు

వైద్యులకు సత్కారం

చీరాల : ఐఎంఎ ప్రెసిడెంట్, సెక్రటరీ డాక్టర్ పి. శ్రీదేవి, డాక్టర్ పి.శ్రీకాంత్ అధ్యక్షతన ఐఎంఎ హాల్‌లో గుండె, కిడ్నీ జబ్బులపై సోమవారం మెడికల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ విసిటింగ్ స్పెషలిస్ట్ వైద్య బందం, ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ కొసరాజు కమలాకర్,లైఫ్ హాస్పిటల్,గుంటూరు మరియు కిడ్నీ ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్‌వి. కష్ణారావు ప్రకాశం హాస్పిటల్, ఒంగోలు వారు ఇమేజ్ గైడెడ్ పిటిసిఎ మరియు యూరో గైనకాలజీకి సంబంధించిన లేటెస్ట్ మెడికల్ అప్‌డేట్స్ మరియు అందు బాటులో ఉన్న వైద్య విధానాల గురించి వివరించారు. అనంతరం వారిని మెమోం టోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చీరాల వైద్యులు డాక్టర్ బాల శంకర్రావు, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ బాపయ్య, డాక్టర్ భవాని ప్రసాద్, డాక్టర్ పివి. ప్రసాద్, డాక్టర్ బాబూరావు, డాక్టర్ ఎన్. వెంకట్రావు, డాక్టర్ ముద్దన నాగేశ్వరరావు , డాక్టర్ ఉమామోహన్, డాక్టర్ శేషు కుమార్, డాక్టర్ రామకష్ణ హనుమాన్ ,డాక్టర్ శ్యామ్,డాక్టర్ కొండలరావు, డాక్టర్ శంకర్‌రెడ్డి, డాక్టర్ సాంబశివరావు, చీరాల ఐఎంఎ వైద్య నిపుణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రంథపాలకుడు

బుక్ డిపాజిట్ సెంటర్ ప్రారంభం

సంతమాగులూరు : ప్రతి ఒక్కరికీ గ్రంథాలయ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు బుక్ డిపాజిట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు సంతమాగులూరు గ్రంథ పాలకుడు బాదం విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఏల్చూరు, మక్కెనవారిపాలెం, మామిళ్ళపల్లి గ్రామాలలో బుక్ డిపాజిట్ సెంటర్లను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మందా సూరిబాబు, సోషల్ వర్కర్ మందా జోసెఫ్, అడ్వకేట్ రూపేష్, ఆయా సెంటర్ల నిర్వహకులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

జిల్లా ఇన్ ఛార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

చుండూరు మండల పరిధిలోని యడ్లపల్లి గ్రామంలో ఈనెల 21న నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు జిల్లా ఇన్ ఛార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఏర్పాట్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్‌పి వకుల్ జిందాల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్ 8వ తరగతి విద్యార్థు లకు ల్యాప్ టాప్‌లు పంపిణీ చేసేందుకు ఇక్కడి వస్తున్నట్లు తెలిపారు. 21న ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యడ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్ ను, ఎవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సభా వేదికను మంత్రులు,కలెక్టర్, ఎస్‌పి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్,జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, ఆదనపు ఎస్‌పి మహేష్,రేంపల్లె,చీరాల, బాపట్ల ఆర్‌డిఒలు పార్థసారథి, సరోజిని, రవీంద్ర, పౌర సరఫరాల శాఖ డిఎస్‌ఒ విలియమ్స్, డిఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిఎం సభ ఏర్పాట్లను పరిశీలస్తున్న మంత్రులు, కలెక్టర్, ఎస్‌పి

క్రీడలతో ఆరోగ్యం : కరణం

ప్రజాశక్తి-చీరాల

క్రీడలతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ తెలిపారు. ఈనెల 21న సిఎం జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని చీరాల నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఆటలు పోటీలు నిర్వహించారు.ఈ పోటీలను కరణం వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న సిఎం జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చీరాల నియోజకవర్గంలోని ఎఆర్‌ఎం హై స్కూల్, కెజిఎం హై స్కూల్, ఎన్ ఆర్ అండ్ పిఎం హైస్కూల్ విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు,వైస్ చైర్మన్ జైసన్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు,చీరాల, వేటపాలెం మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న కరణం వెంకటేష్

విద్యార్థులు క్రీడలలో రాణించాలి : ఎమ్మెల్సీ

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్సీ పోతుల సునీత తెలిపారు. ఈనెల 21న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పుసర్కరించుకొని చీరాలలోని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజ్ లో జగనన్న క్రీడ సంబరాల్లో భాగంగా సోమవరాం ఆటలు పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోతుల సునీత మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అమ్మఒడి, విద్యా దీవెన పథకాల ద్వారా పలువురికి లబ్ధి చేకూరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విద్యాసాగర్, ప్రిన్సిపల్ పుష్పరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

తుఫాను కారణంగా పంటలు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతుసంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు కోరారు. స్పందన కార్యక్రమంలో తహశీల్దారు, ఎఒ పోతిన వేణుగోపాల్‌లను కలిసి ఈ మేరకు అర్జీ అందజేశారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మండల రైతులు సాగు చేసిన మిర్చి, పొగాకు, శనగ, మొక్కజొన్న పంటలు తుఫాను కారణంగా దెబ్బతిన్నాయన్నారు. అధికారులు స్పందించి పంట నష్టం అంచనా వేసి పంట నష్ట పరిహారం అందించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతు సంఘం నాయకులు బాచిన కోటేశ్వరరావు, అన్నెం ఆదియ్య, మాదాల అంజయ్య తదితరులు ఉన్నారు.



ఎఒకు రైతుసంఘం నాయకుల వినతి

గ్రీటింగ్ స్పీచ్‌కి ఐలవరం విద్యార్థినులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ నెల 21న వేమూరు నియోజకవర్గ పరిధిలోని చుండూరు మండలం యడ్లపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సిఎం జగన్మోహన్‌రెడ్డి సభ నిర్వహిస్తున్నారు. ఈ సభలో గ్రీటింగ్ స్పీచ్ ఇచ్చేందుకు భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుకాటూరు లక్ష్మీనారాయణ తెలిపారు.ఈ విద్యార్థులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ఆంగ్ల భాషలో వేదికపై మాట్లాడనున్నట్లు తెలిపారు.



గ్రీటింగ్ స్పీచ్‌కు ఎంపికైన విద్యార్థినులు

నష్టపరిహారం ఇచ్చి రైతులకు ఆదుకోవాలి

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి- అద్దంకి



భారీవర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఓ ప్రకటనలో కోరారు. ఈ క్రాప్ తో సంబంధం లేకుండా నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని పేర్కొన్నారు. పంటలకు రైతులు పెట్టిన పెట్టుబడిని పరిగణంలోకి తీసుకొని నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పొగాకు రైతులకు పూర్తి స్థాయిలో నష్టం వాటిల్లిందని తక్షణసాయం కింద రూ.40వేల నగదు ఇచ్చి ఆదుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావంతో వరి, మిరప, పొగాకు, పత్తి,మినుము ,పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం సర్వేచేసి అర్హులైన రైతులందరికీ పరిహారం అందించాలన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి సాగుచేసిన మిరప,పత్తి, పొగాకు,తదితర ఉద్యాన పంటలు వేలాది ఎకరాలు నీటమునిగాయని, చేతికొచ్చిన పంటలు కళ్లెదుటే నీట మునగటంతో అన్నదాతలు కన్నీరుమున్నీ రవుతున్నారు అని ఆవేదన వ్యక్తంచేశారు, అద్దంకి నియోజకవర్గంలో మిర్చి 10,600 ఎకరాలు, శనగ 12,500 ఎకరాలు, పొగాకు 3,000 ఎకరాలు, మొక్కజొన్న 10,500 ఎకరాలు, వరి 15,685 ఎకరాలు, మినుము 2. 000 ఎకరాలు, పత్తి 2.000 ఎకరాల్లో రైతులు సాగు చేసినట్లు తెలిపారు. పొగాకు పంటకు 2వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే అధికారులు కేవలం 475 ఎకరాలు మాత్రమే నష్టం జరిగిందంటూ నివేదించడం సరికాదన్నారు.శనగ పంట పదివేల ఎకరాలకు పైగా దెబ్బతిన్నట్లు తెలిపారు. అధికారులు కేవలం 4,600 ఎకరాలు మాత్రమే దెబ్బతిందని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. మొక్కజొన్న 5వేల ఎకరాలకు పైగా పంట నష్టపోయారని తెలిపారు.వరి పంటలకు రెండు వేల ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. మినుము పంట 2వేల ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తెలిపారు. పంటల దెబ్బతిన్న ప్రతి రైతుకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు.

ప్రజాశక్తి 5
మంగళవారం 20 డిసెంబర్ 2022

మహిళలకు అండగా ముఖ్యమంత్రి జగన్

వైసిపి కొండపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళలకు అండగా ఉంటారని కొండపి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమవారం నాడు శింగరాయకొండ వెలుగు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలతో పాటు అన్ని రకాల ఆటలు పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన వరికూటి అశోక్‌బాబు కేకును కట్ చేశారు. కార్యక్రమంలో ఎండిఓ షేక్ జమీ ఉల్లా, ఏరియా కోఆర్డినేటర్ రాంబాబు, ఏపీఎం ఆదిశేషు, సీసీలు గురవయ్య శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు షేక్ షకీల, సామంతుల రవికుమార్ రెడ్డి, పుట్ట వెంకటరావు, గాలి బుజ్జిరాజు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అమానుగుడిపాడు విద్యార్థికి ఏడో ర్యాంకు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రఖ్యాత గణిత శాస్త్రవేత శ్రీనివాస రాజానుజన్ జయంతిని పురస్కరించుకొని మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మార్కాపురం డివిజన్ స్థాయి గణిత ప్రతిభా పరీక్షలో మండలంలోని అమానుగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి సుబ్బారావు ఏడో ర్యాంకు సాధించాడు. మొత్తం 1600 మంది పాల్గొన్న ఈ పరీక్షలో ఏడో ర్యాంకు సాధించడం పట్ల మండల విద్యాశాఖాధికారి పి ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె గోపి అభినందించారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సంధర్భంగా ఆటల పోటీలను వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సంధర్భంగా మూడు రోజులు పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెట్లు నాటే కార్యక్రమాలు, రక్తదానం కార్యక్రమాలు, జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దర్శనం నాగయ్య, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సలాం, వైసిపి నాయకులు వెన్నా కాశిరెడ్డి, గుమ్మా యల్లేష్, సీతారామయ్య, జంకె సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డులు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం

'యువతేజం ట్రస్ట్' మరియు 'కలం విజన్' తిరుపతి వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కల్చరల్ అకాడమీలో జరిగిన డాక్టర్ అబ్దుల్ కలాం పీస్ ఆఫ్ అవార్డు-2022 కార్యక్రమంలో వివిధ రంగాలలో సేవలందించిన వారికి అవార్డులను అందజేశారు. అందులో ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన ఆదరణ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గొట్టెముక్కుల చెన్నకేశవులకు ఈ అవార్డును ప్రదానం చేయడం జరిగింది. కరోనా కాలంలో చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును అందించారు.

వేలం ద్వారా రూ.4.51 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం, పాత శింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. కందుకూరు ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈవో కష్ణవేణి మాట్లాడుతూ కొబ్బరి కాయలు, పూజద్రవ్యములు, కొబ్బరిచిప్పలు, సప్లయి సామగ్రి అమ్ముకోవటానికి, భక్తులచే సమర్పించబడు తలలీలాలు ప్రోగు చేసుకొను హక్కు రూ.1,35,000 మొత్తం స్వామి వారికి ఆదాయం రూ.451,000 వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పామర్తి మాధవరావు, సిహెచ్.వెంకటేశ్వర్లు, సిబ్బంది బాపట్ల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన 90 కుటుంబాలు

ప్రజాశక్తి-పొదిలి

మండలంలో ఈగలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా సుమారు 90 వైసీపీ కుటుంబాలకు చెందిన వారు టీడీపీలో చేరారు. కందుల నారాయణరెడ్డి సమక్షంలో సర్పంచ్ చిన్నపురెడ్డి యర్రారెడ్డి, బోగిరెడ్డి కోటిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు కప్పి.. నారాయణరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇటుక రాళ్ల పేరుతో మోసం

- ఒక్క లారీకి రూ.61,560 మోసపోతున్న వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో కొత్తతరహా మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నూతన గహానికి శంకుస్థాపన చేస్తే చాలు ఇద్దరు వాలిపోతారు. ఇల్లు కట్టడానికి మంచి ఇటుక సరఫరా చేస్తామని చెప్పి ఇటుకను తీసుకొని వస్తారు. పెద్ద లారీలో ఇటుకను తీసుకొచ్చి లెక్కల్లో గందరగోళం చేస్తారు. ఆ గందరగోళం తెలియని గృహనిర్మాణ యాజమానులు ఈ ప్రాంతంలో మోసపోతూనే ఉన్నారు. వివరాల్లోకి వెళితే శింగరాయకొండ మండలం, సోమరాజుపల్లి పంచాయతీలోని పక్కిరుపాలెం దగ్గరలో ఉన్న షేక్ నాయబ్ రసూల్, రషీద దంపతులు నూతన గహ నిర్మాణం మొదలుపెట్టారు. పిల్లి దుర్గాప్రసాద్ అనే వ్యక్తి వచ్చి మైలవరం నుంచి ఇటుక రాళ్ల తీసుకొస్తామని నమ్మించారు. పెద్ద లారీలో ఇటుకలు వచ్చాయి. 13200 రాళ్లు ఉన్నాయని వీళ్ళ ఇంటి వద్ద దించారు. వీళ్ళ వద్ద నుంచి రూ.1,13,000 తీసుకున్నారు. డబ్బులు ఇచ్చిన తర్వాత నాయబ్ రసూల్ ఇంటికి బేల్దారు పనికి వచ్చిన కార్మికులు ఈ ఇటుక 13,200 ఉండవని ఇంటి యజమానికి వివరించారు. దీంతో అనుమానం వచ్చిన నాయబ్‌రసూల్ దంపతులు రెండు రోజుల నుంచి ఇటుక లెక్క వేయడం మొదలుపెట్టారు. 13200 ఉండాలి కానీ ఇక్కడ ఇటుక 6000 మాత్రమే ఉన్నాయి. 7,200 ఇటుక దించకుండా హడావుడి లెక్కలతో



ఇటుకరాళ్లను చూపిస్తున్న రషీదా

దించినట్టు డబ్బులు తీసుకుపోయారు. 13,200 ఇటుకలకు ఒక్క ఇటుక 8 రూపాయలా 55 పైసలు పడింది. రూ.1,13,000 బాధితుల నుంచి తీసుకువెళ్లారు. ఒక్క లారీకి ఇటుకల పేరుతో మోసం చేసి 61,560 రూపాయలు నష్టం వాటిల్లిందని బాధితులు బోరున విలపిస్తున్నారు. ఇటుకలు మొత్తం లెక్కలు వేసుకొని సింగరాయకొండ ఎస్ఐ ఫిరోజా ఫాతిమాకు ఫిర్యాదు చేశారు. ఎన్నో రకాలు మోసాలు చూశామని, ఇలా ఇంటికి కట్టుకునే ఇటుక పేరుతో కూడా మోసం చేయటం ఎక్కడా చూడలేదని.. అటు పోలీసులు, ఇటు బాధితులు చెబుతున్నారు. ఇలాంటి వాళ్ళ ప్రతి రోజూ ఆ ప్రాంతం నుంచి రెండు లారీల్లో ఇటుకు తీసుకొచ్చి ఇలా మోసం చేస్తూ ఉంటారని అంటున్నారు. ఇలాంటి సంఘటన రెండు రోజుల క్రితం శింగరాయకొండకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కాక శ్రీనివాసులుకు కూడా జరిగింది. పోలీసులు సిసి కెమెరాలను పరిశీలించి.. పూర్తి సమాచారాన్ని సేకరించే పనిలో ఉన్నారు.

ఉద్యోగ భద్రత కోసం పోరాడదాం..: సిఐటియు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో వివిధ స్కీంలలో పనిచేస్తున్నటువంటి స్కీంవర్కర్ల ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్. కనీస వేతన చట్టాల కోసం పోరాటాలు నిర్వహించాలని సిఐటియు జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలో సిఐటియు మండల మహాసభ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. జిల్లా నాయకులు మాట్లాడుతూ జిల్లా మహాసభలు ఈనెల 27,28 తేదీలలో చీమకుర్తిలో జరగనున్నాయని, జయప్రదం చేయాలని కోరారు. మాలకొండయ్య మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలన్నారు. అన్ని రంగాల వారు ఒక వేదిక మీదకు రావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పది సంవత్సరాలు నిండిన



మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను, కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులను తొలగించాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకురాలు రాధమ్మ, గౌసియా బేగం, బుజ్జమ్మ, ఆర్.రమాదేవి, అరుణ పాల్గొన్నారు.

ప్రయాణికులకు సౌకర్యవంతంగా బస్సు సర్వీసులు

మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం డిపో నుండి మార్కాపురం-నంద్యాల మార్గంలో ఆల్ట్రా పల్లె వెలుగు బస్సు సర్వీసులు రెండు మంజూరు కాగా... వాటిని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల-మార్కాపురం మార్గంలో ఇటీవల కాలంలో ప్రయాణీకుల రద్దీ పెరిగిందన్నారు. ఈ రెండు సర్వీసులతో ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. ఆర్టీసి సేవలను ప్రయాణీకులు సద్వినియోగం చేసుకుని ఆర్టీసి ఆదాయానికి దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, 9వ వార్డు కౌన్సిలర్ మొఘల్ సిరాజ్‌తుల్లా బేగ్,



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎఎస్ నరసింహులు, అసిస్టెంట్ మెనేజర్ కామేశ్వరి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.నాగిరెడ్డి, కంట్రోలర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలి

జెవివి నాయకులు డాక్టర్ బి.హరిబాబు

ప్రజాశక్తి-శింగరాయకొండ

జెవివి ఆధ్వర్యంలో చెకుముకి జిల్లాస్థాయి సైన్స్ సంబరాలు పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగాయి. జిల్లాలోని 36 మండలాల నుండి 152 మంది విద్యార్థులు హాజరవ్వగా శింగరాయకొండ లోటస్ స్కూల్ నుండి కోడిపల్లి ప్రదీప్ 10వ తరగతి విద్యార్థి అరిబోయిన భానుశ్రీ, 9వ తరగతి నుంచి ఇమ్రాన్, 8వ తరగతి చదువుతున్న విద్యార్థి తృతీయస్థానంలో నిలిచారు. కార్యక్రమంలో జెవివి శింగరాయకొండ మండల శాఖ నుండి



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ బి.హరిబాబు

జిల్లా గౌరవాధ్యక్షులు ప్రముఖ డాక్టర్ బి.హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కోటపాటి నారాయణ, గుంటక రామలక్ష్మి, లోటస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నక్కా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి

జడ్పీటీసీ మారెడ్డి అరుణకుమారి

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని పనిచేసే అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రతిఒక్కరూ గ్రామాలలో ఉండే సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంఘం చైర్మన్, జడ్‌పిటిసి మారెడ్డి అరుణకుమారి తెలిపారు. సోమవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం యంపిపి కొండసింగు స్వప్నకుమార్ అధ్యక్షతన జరిగింది. అరుణకుమారి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం అనేది మండలంలోని ఉన్న సమస్యలను గురించి తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిందని, అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ దీనిని సీనియస్‌గా తీసుకోవడం లేదని అన్నారు. ఆయా శాఖల అధికారులు సరిగ్గా పనిచేయడం లేదని ప్రజాప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో యంపిడివో బ్రహ్మయ్య, మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

21న సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఈ నెల 21న సాయంత్రం ఐదు గంటలకు టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు టిడిపి ఎస్సీ సెల్ నాయకులు గోనా వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, క్రైస్తవ సోదరులు పాల్గొనాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

రాచర్ల కస్తూరిబా పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం గిద్దలూరు శాసనసభ్యులు అన్నా వెంకట రాంబాబు సోమవారం అదనపు గదుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఆకవీడు మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద నూతన భవన నిర్మానానికి భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో విద్యార్థుల చదువులే లక్ష్యంగా అన్నిరకాల సౌకర్యాలు, పౌష్టికాహారం అందచేస్తున్నామన్నారు.

చర్చి ప్రారంభం

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు మండలంలోని నూతనంగా ఏర్పాటు చేసిన చర్చిని కొండపి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ డోల శ్రీబాలవీరాంజనేయ స్వామి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు మండవ ప్రసాద్, ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ మండవ మురళీమోహన్, నియోజకవర్గ టీడీపీ మీడియా కోఆర్డినేటర్ నేలపాటి బ్రహ్మయ్యచౌదరి పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలో విద్యావైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-తర్లుపాడు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉన్నత పాఠశాలలు మరియు ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన విద్యా వైజ్ఞానిక పరికరాలను ప్రదర్శించారు. పాఠశాలలోని విద్యార్థులు వాటిని ఆసక్తిగా తిలకించారు. ఈ పరికరాల ఉపయోగాల గురించి విద్యార్థులకు చక్కగా వివరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎస్.నరసింహులు మాట్లాడారు. న్యాయ నిర్ణేతలుగా కళాశాల లెక్చరర్లు రామకష్ణ, యూసఫ్ భాషా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.నరసింహులు, మండల నాయకులు సూరెడ్డి సుబ్బారెడ్డి, మురారి శ్రీను, రిటైర్డ్ ఎంఇఒ బసిరెడ్డి పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ రవాణా అడ్డగింత

ప్రజాశక్తి -శింగరాయకొండ

మండలంలోని శానంపూడిలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి.. చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రావి నూతల కోటి డిమాండ్ చేశారు. సోమవారం అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్‌ను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్విన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రేణమాల మాధవ మాదిగ పాల్గొన్నారు.



మౌర్య మెడికల్స్‌ను ప్రారంభిస్తున్న బాలినేని

త్వరలోనే కందుకూరు, చీరాలలో శాఖలు

మౌర్య మెడికల్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి-టంగుటూరు

ఒంగోలు, టంగుటూరుతో పాటు త్వరలోనే కందుకూరు, చీరాల ప్రాంతాలలో కూడా మౌర్య మెడికల్స్ శాఖలను ప్రారంభిస్తారని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కొండపి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మౌర్య మెడికల్స్‌ను బాలినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మనసున్న మౌర్య మెడికల్స్ యజమాని మారుతీ రావుకు అంతా మంచే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, మౌర్య మెడికల్స్ యాజమాన్యం కొల్లూరి మారుతీరావు, అపర్ణ దంపతులు, వైసీపీ మండల అధ్యక్షులు సూదనగుంట శ్రీహరిరావు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న వాలంటీర్లు

ఉప్పుగుండూరు చెరువులో ఆపదమిత్ర శిక్షణ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరు చెరువులో ఏపిఎస్ఐఆర్‌డి మరియు జిల్లాపరిషత్ ఆధ్వర్యంలో చెరువులో ఆపదమిత్రపై శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పడవ ప్రమాదం జరిగినప్పుడు.. వరదలు వచ్చినప్పుడు.. చెరువులో మునిగినప్పుడు.. ప్రజలు వరదలో కొట్టుకుపోతునప్పుడు.. వారిని ఏవిధంగా రక్షించాలో తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ జయమ్మ, కార్యదర్శి ఎం.శ్రీరామ్మూర్తి, జిల్లా డైవింగ్ మేనేజరు ఎ.అమర్‌బాబు, ఇన్‌ఛార్జ్ ఏవో సుబ్బారావు, చక్రధ, వినయ్, ఖాజావలి, సురేష్‌బాబు, కష్ణయ్య, గౌతమ్ పాల్గొన్నారు.

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



పద్మావతి నరసింహులు

గిద్దలూరు బాయ్స్ హైస్కూల్‌లో సిఐటియు ఏడో మహాసభలో గిద్దలూరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా జి.పద్మావతి, ప్రధాన కార్యదర్శిగా డి.నరసింహులు, ఉపాధ్యక్షులుగా ఎల్.రాజమణి, శ్రీను, మురళి, ఎం.హారోన్, సహాయ కార్యదర్శులుగా జి.విశ్రాంతమ్మ, ఆనందరావు, సమీరా, జి.ఓబులేసు, కమిటీ సభ్యులుగా ఏ.కుమారి, డి.నరసమ్మ, కాశమ్మ, బాషా, అంజి, శ్రీను, నాగయ్య, స్వర్ణ, నూర్జహాన్, సాయిలక్ష్మి, రూతమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య పాల్గొన్నారు.

పామూరులో..

సిఐటియు పామూరు మండల ఏడో మహాసభలో సిఐటియు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. సిఐటియు అధ్యక్షులుగా షేక్ మస్తాన్, ఉపాధ్యక్షులుగా షేక్ ఖాదర్ బాషా, పందిటి శ్రీనువాసులు, డి.రామసుబ్బులు, మండల ప్రధాన కార్యదర్శిగా కొమ్మలపాటి మాల్యాద్రి, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసరెడ్డి. జకరయ్య, సిహెచ్ రాజ్యం, ట్రెజరర్ షేక్ అల్లాబక్షు, 15 మంది మండల కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బ్రిడ్జి కుంగి.. ప్రమాదకరంగా గుంత

వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండల పరిధిలోని బోడిచెర్ల గ్రామ సమీపంలో ఉన్న గుండ్లకమ్మ వాగుపై నిర్మించిన బ్రిడ్జి కుంగిపోయి ప్రమాదకరమైన గుంత ఏర్పడింది. ఈ బ్రిడ్జిపై నుండి మార్కాపురం, తర్లుపాడు నుండి కంభంకు వందల సంఖ్యలు వాహనాలు, పాఠశాల, కళాశాల బస్సులు, ఆటోల రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఒక్కసారిగా బ్రిడ్జి కుంగిపోయి పెద్ద గుంత ఏర్పడింది. దీంతో గ్రామస్తులు హుటాహుటిన ఘటన గురించి సంబంధింత అధికారులకు తెలియజేశారు. గ్రామస్తులే స్వచ్ఛంధంగా ముందు వచ్చి ఒక బృందంగా ఏర్పడి ఆ రహదారి గుండా ఎలాంటి వాహనాలను అనుమతించటం లేదు. ఒక వేళ రాత్రి సమయంలో ఈ బ్రిడ్జి కుంగి ఉంటే పెద్ద ఎత్తున ప్రమాదం సంభవించి ఉండేదన్నారు. పాలకులు, అధికారులు స్పందించి గుండ్లకమ్మ వాగుపై నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న గుంత

సమస్యలు పరిష్కరించేందుకే వచ్చా..

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రతి కుటుంబంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించమనే తనను ముఖ్యమంత్రి జగన్ మీ ఇంటికి పంపారని, ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డిని మళ్ళీ ఆశీర్వదించాలని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎం.నిడమలూరు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అశోక్‌బాబు నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని వికలాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, గ్రామ సర్పంచ్ పిడుగురాళ్ల వెంకటశేషమ్మ, ఉప సర్పంచ్ కాకుమాని సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి బి సుబ్బాయమ్మ, విఆర్ఒ ఎం.కొండలరావు, వైసీపీ నాయకులు వాకా బాలకష్ణారెడ్డి, పిడుగురాళ్ల స్వామినాథ్ పాల్గొన్నారు.



ట్రై సైకిల్ అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్‌బాబు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక శాసనసభ్యులు టిజెఆర్. సుధాకర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఈదుమూడి సచివాలయ పరిధిలోని మట్టిగుంట గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామం లో ఉన్న కీర్తిశేషులు ముఖ్య మంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి మూడేళ్లలో జరిగిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించడంతో పాటు మూడేళ్లలో ఆ కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలుపుతూ సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎంపిపి నలమలపు అంజమ్మ, జడ్‌పిటిసి యాదాల రత్నభారతి, సర్పంచ్ పాలేరు అనిలాకుమారి, ఆరోగ్య శ్రీ ట్రస్ట్ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

నాసిరకం పైపులైన్ పనులపై ఆగ్రహం

నిలిపివేయించిన సర్పంచ్, గ్రామస్తులు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో డ్రైనేజీ నీరు బయటకు వెళ్లే పనులను నాసిరకంగా చేస్తుండటంపై సర్పంచ్ తల్లపనేని రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని డ్రైనేజీ మురుగునీరు అంతా ఊరి బయటకు వెళ్లేందుకు వీలుగా కాలువ ఉంది. గ్రామంలోకి వెళ్లే సర్వీస్ రోడ్డు విస్తరణ పనులను జాతీయ రహదారి అధికారులు ఇటీవల గ్రామంలో చేపట్టారు. ఇక్కడే ఉన్న డ్రైనేజీ పనులను కూడా అధికారులు నూతన విధానంతో పటిష్టంగా చేయాల్సి ఉండగా అలా కాకుండా కేవలం ఒక అడుగు ఖానా పైపులైనుతో పనులను నాసిరకంగా నిర్మిస్తున్నట్లు సమాచారం అందుకున్న సర్పంచ్ రవికుమార్ వెంటనే పనుల వద్దకు వెళ్లి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకంగా చేస్తున్న పనులను వెంటనే నిలిపివేయించారు. గ్రామంలోని డ్రైనేజీ నీరు అంతా బయటకు వెళ్లే పనులు ఒక్క అడుగు పైపుతో ఎలా నిర్మిస్తారని, స్థలం సరిపోకపోతే పైపులైను నిర్మాణం నాణ్యతగా జరిగేందుకు వీలుగా అదనంగా భూమిని సేకరించి పనులు నాణ్యతగా చేపట్టాలని పట్టుబట్టారు. అవసరమైతే రోడ్డుకిరువైపులా కల్వర్టు నిర్మించాలని హైవే అధికారులను సర్పంచ్ రవికుమార్ డిమాండ్ చేశారు.



నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్

జడ్పీలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



కేక్ కట్ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

స్థానిక జిల్లాపరిషత్ కార్యాలయంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి క్రిస్మస్ కేకును కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీ సిఇఒ బి.జాలిరెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ లోకల్ ఫండ్ అసిస్టెంట్ ఆడిట్ అధికారి సిహెచ్ రమేష్, పంచాయతి రాజ్ మినిస్టీరియల్ జిల్లా శాఖ అధ్యక్షులు కె.విద్యా సాగర్ రెడ్డి, పరిషత్ యూనిట్ అధ్యక్షులు పిట్టు శ్రీనివాస రావు, పరిపాలనాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి పథకాలు నిర్వీర్యం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి పథకాలు నిర్వీర్యమని టిడిపి ఎస్‌సి సెల్ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు చుండి శ్యామ్ విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి పథకాలు నిర్వీర్యం కావటాన్ని ఖండిస్తూ టిడిపి ఎస్‌సి సెల్ ఒంగోలు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు హగ్గయ్యరాజ్, వై.శశికాంత్ భూషణ్, కసుకుర్తి అంకరాజు, సుబ్బారావు, వి.సురేష్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మండల పరిధిలోని గజ్జలకొండ గ్రామంలో ఈ- పంట నమోదును ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావం వల్ల 33 శాతం కంటే ఎక్కువగా పంట నష్టపోయిన రైతులు వెంటనే రైతుభరోసా సిబ్బందిని సంప్రదించి.. వివరాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో విఎఎ నవీన్‌కుమార్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద వికలాంగుల దీక్ష

ప్రజాశక్తి- కొత్తపట్నం

వృద్ధులకు, వికలాంగులకు పింఛన్ రూ.ఆరు వేలు ఇవ్వాలని కోరుతూ సోమవారం కొత్తపట్నం ఎంపీడీవో కార్యాలయం వద్ద వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం రిలే దీక్ష చేశారు. ఈ సందర్భంగా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆనాల సురేష్ మాట్లాడారు. దీక్ష అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఈవోఆర్డీ బాలచెన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకులు తోరటి ఆనంద్ మాదిగ, జజ్జన రాఘవ, పురిని కుమారి, తురకపల్లి లక్ష్మీనారాయణ, నాటారు శ్రీనివాసులు, నాటారు వెంకటేశ్వరమ్మ, వి.కాంతారావు, పిన్ని శివయ్య, బి.అన్నపూర్ణ పాల్గొన్నారు

రంజాన్, క్రిస్మస్‌లకు కూడా..
సెలవులివ్వాలని నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

సంక్రాంతి, దసరా పండగలకు ఇచ్చే పాఠశాల సెలవులు రంజాన్, క్రిస్మస్ పండుగలకు కూడా అదేవిధంగా సెలవు దినాలను ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి పి.ఉమారాణికి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డానియల్ మాదిగ పాల్గొన్నారు.

రైతులకు సాయం అందకుండా కుట్ర

ప్రజాశక్తి-టంగుటూరు

విపత్తుల సమయాలలో కూడా అన్నదాతలకు సాయం అందకుండా చేసేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కుట్ర చేస్తూ.. కొర్రీలు పెడుతున్నాయని రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వేజెండ్ల రామారావు, పరిటాల కోటేశ్వరరావు విమర్శించారు. మండలంలోని పొందూరులో అధిక వర్షాలకు పొగాకు వేరు కుళ్లి ఉరకెత్తిన పొగ మొక్కలను కూలీల ద్వారా సోమవారం పీకి వేస్తున్న నేపథ్యంలో పంటలను నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు బెజవాడ శివరామకష్ణయ్య, గొల్లపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి సంతనూతలపాడు రూరల్

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని మైనంపాడు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల పీడీ కె.వనజ, పిఈటి టి.రవి కుమార్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆద్వర్యంలో చీమకుర్తిలో జరిగిన సాఫ్ట్‌బాల్ జూనియర్ బాలికల ఎంపికలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎస్‌కె కమురున్, ఐ.నాగవేణి, టి.సాయిశ్రీవాణి ఈ నెల 21, 22, 23 తేదీలలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఇందిర తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫాఖుల్లాఖాన్ - రాంప్రసాద్ బిస్మిల్

నేటి యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మహాత్మాగాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య సమరయోధుడిగా భారత స్వాతంత్ర్య విప్లవ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి దేశస్వాతంత్రం కోసం బ్రిటిష్ వారి చేతిలో వీరమరణం పొందిన అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ను నేటి యువత ఆదర్శం గా తీసుకోవాలని సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు మహ్మద్ బాషా పిలుపునిచ్చారు. అష్ఫాఖుల్లాఖాన్ - రాంప్రసాద్ బిస్మిల్ 95వ వర్ధంతి సభను జిల్లా కార్యదర్శి మేకా ఇర్మియా అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ బాషా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య విప్లవోద్యమంలో 'అగ్నిశిఖలు' గా కీర్తించబడిన పండిత రాంప్రసాద్ బిస్మిల్ - అష్ఫాఖుల్లా ఖాన్‌ను విప్లవకారులుగా ముద్రవేసిన బ్రిటిష్ ప్రభుత్వం 1927 డిసెంబర్ 19న ఉరిశిక్ష విధించిందన్నారు. నరేంద్రమోడీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రకటిత లక్ష్యమైన కార్పోరేట్ బ్రాహ్మణ-బనియా- అగ్రకులాల మనువాద రాజ్యస్థాపనకు వడివడిగా అడుగులు వేస్తూ స్వాతంత్ర్య పోరాటంలో అశేష త్యాగాలు చేసిన భారతీయ ముస్లింలను దేశద్రోహులుగా చిత్రీకరించడానికి అబద్ధాలతో నిండిన విషప్రచారం సాగించడం దారుణ మన్నారు. కీలకమైన రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆమోదించి, అమెరికా సామ్రాజ్యవాదానికి ఫిడేలు వాయించేదిగా నరేంద్ర మోడీ(బిజెపి) ప్రభుత్వం తయారైందని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన మహా కూటమి రాష్ట్ర నాయకులు మైలా చిన్న నాగేశ్వరావు, ఎఐఆర్‌డబ్ల్యుఒ రాష్ట్ర కార్యదర్శి సుజాత, విశ్రాంత ఉద్యోగుల సంఘం మార్టూరు యూనిట్ అధ్యక్షుడు షేక్ కమాలుద్దీన్, కుల నిర్మూలన ఉద్యమం నాయకులు చలపతి, జాన్ వెస్లీ, జె.అంజయ్య పాల్గొన్నారు. **బాపట్ల రూరల్** : స్వతంత్ర సమర అమరవీరుడు అష్ఫాఖుల్లాఖాన్ 95వ వర్ధంతి బాపట్ల సాహితీ భారతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం రాంప్రసాద్ బిస్మిల్ నెలకొల్పిన హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్‌కు ఆయుధ సంపత్తిని సమకూర్చుకునే నిమిత్తం, బ్రిటిష్ ప్రభుత్వం భారతీయులను దోచుకుని రైలులో తీసుకు వెళుతున్న ధనాన్ని ఉత్తర ప్రదేశ్ లోని కాకోరి రైల్వే స్టేషన్ వద్ద స్వాధీనపరచుకొని రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కాకోరి రైలు దోపిడీ ఘటనతో దిగ్భ్రాంత పరచి నవ్వుతూ ఉరి కంభాన్ని అలంకరించిన అష్ఫాఖుల్లా ఖాన్ భారత దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంభాన్ని అధిరోహించిన తొలి ముస్లిం స్వాతంత్ర్య సమర అమర యోధుడు అని కొనియాడారు. సాహితీభారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ అష్ఫాఖుల్లా ఖాన్ గొప్ప కవి అని, స్వాతంత్ర్యోద్యమ పోరాటాన్ని ప్రేరేపిస్తూ కవితలు కూడా రచించి యువకులలో స్వాతంత్ర్య పోరాటపటిమను పెంపొందించారని తెలిపారు. ప్రముఖ నటుడు మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం నవ్వుతూ ఉరికంబాన్ని ముద్దాడిన అష్ఫాఖుల్లా ఖాన్ అమరుడని, సదాస్మరణీయుడని ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో ఎం.జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు,బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎన్.కష్ణ, రెంటాల మురళీ రాధా కష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

మొక్కలు నాటిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కర్లపాలెం

ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్క రించుకొని కర్లపాలెం గ్రామ సచివాలయం వద్ద వైసిపి నాయకులు మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షుడు సీతారామిరెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని చింతయపాలెం హైస్కూల్‌లో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 21న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేణుగోపాల్ రెడ్డి, ఎంపిటిసి ఆసిఫ్ హాలీ, వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, మాజీ కోఆప్షన్ సభ్యులు తాజ్, పేరాల వెంకట సురేష్, మార్పు బెనర్జీ, నాగేశ్వర్ రెడ్డి, షంషీర్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నాయకులు

23న సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-రేపల్లె

తానా చైతన్య స్రవంతి కార్యక్ర మాలలో భాగంగా దాతల సహకారంతో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న పట్టణంలో పలుసేవా కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు ఎంసిఎ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు తెలిపారు. స్థానిక ఎంసిఎ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23న గన్నే మల్లికార్జునరావు, సామ్రాజ్యం జ్ఞాపకార్థం పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరవల్లి కోటయ్య ఫంక్షన్‌హాలులో కళాశాలల విద్యార్థినులకు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యబందంచే ఉచిత కంటి వైద్యశిబిరం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దంతవైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2వ వార్డులోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిష్ణా తులచే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు, డిగ్రీ కళాశాల విద్యార్థినులకు కేన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తత్వ, డిబెటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తానా ప్రెసిడెంట్ లావు అంజయ్య చౌదరి, తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకట రమణ, గన్నె వెంకట రమణ, పోతూరు వెంకట చలపతి నాయుడు, ఎంసిఎ ఫౌండర్ గుత్తికొండ వరప్రసాద్, తానా మాజీ అధ్యక్షుడు నాదెళ్ళ గంగాధర్, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్న ఆర్చరి క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గరికపాటి గోపిరాజు, మహిళా క్రికెటర్ సబ్బినేని మేఘనను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన పేద విద్యార్థులకు సైకిళ్లు, కుట్టుశిక్షణ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసిఎ సభ్యులు రత్నాకర బాబు, డాక్టర్ వాసుదేవరావు, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, రమేష్, ప్రసాద్, ప్రభల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకాశరావు



స్థానికులతో మాట్లాడుతునర్న బాచిన కృష్ణ చైతన్య

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య

ప్రజాశక్తి- సంతమాగులూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య తెలిపారు. మండలపరిధిలోని కామేపల్లి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత వైసిపి నాయకులు, కార్యకర్తలు కృష్ణచైతన్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కృష్ణ చైతన్య గడపగడపూ తిరిగి ప్రభుత్వ సంక్షమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిచేందుకు సిఎం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చింతా రామారావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సన్నెబోయిన గురు యాదవ్, వెల్లలచెరువు సొసైటీ అధ్యక్షుడు చింతా శ్రీధర్, మోదేపల్లి శ్రీనివాసరావు, వెంకయ్య, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న శివరామకృష్ణ

శివరామకృష్ణకు గురుస్పందన అవార్డు

ఇంకొల్లు రూరల్ : మండల పరిధిలోని నక్కలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న చుండూరి శివరామకృష్ణ ప్రసాద్‌ను గురుస్పందన అవార్డు వరించింది. నెల్లూరు కేంద్రంగా కొనసాగుతున్న ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు పట్టణంలో డికెడబ్ల్యు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఈదా శామ్యూల్ రెడ్డి, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ హరిత తదితరులు శివరామకృష్ణను అవార్డుతో సత్కరించారు. బలవన్మరణాలు జరగని భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పంతో సమాజంలో రుగ్గతలను తొలగించుటకు బాధ్యత కలిగిన ఉపాధ్యాయులను గురుస్పందన అవారుల్డకు ఎంపిక చేసినట్లు తెలిపారు. గురుస్పందన అవార్డును అందుకున్న శివరామకృష్ణను ఎంఇఒ సత్యనారాయణ, అభినందించారు.



శంకుస్థాపనలో నాయకులు

భవన నిర్మాణానికి శంకుస్థాపన

అద్దంకి : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయ మరియు ఉద్యోగుల సంఘ భవవ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు.స్థానిక ఇందిరా నగర్‌లో స్థల దాత చిన్నిమురళీకష్ణ దంపతులు, సంఘ గౌరవాధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి దంపతులు,గోరంట్ల లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి చిన్న మురళీకృష్ణ మూడు సెంట్ల స్థలాన్ని దానం చేశారు. భవన నిర్మాణనికి గోరంట్ల లక్ష్మీనారాయణ రూ.2 లక్షలుచ, కొండ్రగుంట శ్రీరామమూర్తి రూ.1లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. వారణాసి రఘురామ్మ శర్మ రూ.10 వేల అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు సంఘ అధ్యక్షుడు షేక్ మస్తాన్,కార్యదర్శి తేలప్రోలు కష్ణయ్య, కోశాధికారి మారం కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మవరపు సీతారామయ్య, షేక్ గమ్జీ సైదా, కందికట్ల సత్యం, వారణాసి రఘురామశర్మ, బత్తుల అంజయ్య, తేలుకుట్ల మురళీధరరావు,మారం సురేష్, సిహెచ్.అంజలీ దేవి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

డిఆర్‌ఒకి అంజయ్య నగర్ వాసుల వినతి

ఒంగోలు కలెక్టరేట్ : మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి పంచాయతీ అంజయ్య నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసుకు స్థానికులు వినతిపత్రం ఇచ్చారు. ఒంగోలు నగరానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నా 15 సంవత్సరాలుగా అభివద్ధికి నోచుకోని గ్రామంగా అంజయ్య నగర్ ఉందన్నారు. గ్రామంలో 1000 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, సరైన రహదారులు, మురికి నీటి కాల్వలు లేక వర్షపు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారాయన్నారు. గ్రామంలో విషజర్వాలు ప్రబలు తున్నాయని తెలిపారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అద్దంకి

సిఎం వైఎస్.జగన్మోహనరెడ్డి జన్మదినం సందర్భంగా అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో వాలీబాల్ పోటీలను వైసిపి అద్దంకి నియోజకవర్గ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులను, కప్‌లను కోట లక్ష్మయ్య, స్వరాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు కోట శ్రీనివాసకుమర్ అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి పరిరక్షణ సమితి నాయకులు, సింగరకొండ దేవస్థానం ఛైర్మన్ కోట శ్రీనివాసకుమార్, జువ్వి రాము, జాగర్లమూడి యలమందరావు, తుళ్లూరి రమణమ్మ పాల్గొన్నారు.

సిఎం పుట్టినరోజు సందర్భంగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-పొదిలి

డిసెంబర్ 21న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పొదిలి పట్టణంలో వైసీపీ ఆధ్వర్యంలో సిఎం కప్ క్రికెట్ టోర్నమెంట్ రెండోరోజు ఆటలను మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజి గ్రౌండ్‌లో పొదిలి, కొనకనమిట్ల మండలాల పరిధిలోని సుమారు యువ క్రీడాకారులు పాల్గొన్న పోటీలలో వారు పాల్గొని ఆటలు ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సిఐటియు నగర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



రాంబాబు, మహేష్

సిఐటియు ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులుగా చెరుకూరి రాంబాబు, టి. మహేష్ ఎన్నికయ్యారు. సిఐటియు ఒంగోలు 12వ నగర మహాసభలో 35 మందితో కొత్త కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సిఐటియు ఒంగోలు నగర అధ్యక్షులు చెరుకూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శి టి. మహేష్ ,కోశాధికారి ఎమ్‌డి యాసిన్ ,ఉపాధ్యక్షులు దామా శ్రీనివాసులు, జి రమేష్ , కె శ్రీనివాసరావు, యు. రత్నకుమారి, సహాయ కార్యదర్శులు శ్రీరామశ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, కె.వి సుబ్బమ్మ, జివి సుజాత, జె ఉదయ్ కిరణ్ కమిటీ సభ్యులుగా 13 మంది కొత్త ఆఫీస్ బేరర్లు, 22 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

20 తీర్మానాలు ఆమోదం

కరోనా నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులకు ఆప్కాస్ లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇవ్వాలని తీర్మానించారు. మున్సిపల్ ఇంజనీర్ విభాగంలో కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానించారు. క్యాబ్ డ్రైవర్లకు పిఏపీఎస్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కనీస వేతనం 18000 ఇవ్వాలని తీర్మానించారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని క్యాడర్‌లలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని అసంఘటిత కార్మికులకు అర్హులైన అందరికీ వేతనం ఇళ్ల స్థలాలు పక్క ఇల్లు నిర్మించాలని తీర్మానించారు. ఇంటి పని కార్మికులకు గుర్తింపు కార్డులో పని బాధ్యత కల్పించాలని వీధి వ్యాపారస్తులకు పెండింగ్‌లో ఉన్న గుర్తింపు కార్డులు ఇవ్వాలని సబ్సిడీతో కూడిన రుణాలు రెగ్యులర్గా అమలు చేయాలని తీర్మానించారు. బిల్డింగ్, ముఠా, ఆటో కార్మికులతో పాటు అసంఘటిత రంగంలో కార్మికుల అందరికీ 50 సంవత్సరాలు దాటిన వారికి 5000 రూపాయలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని తీర్మానించారు. వాల్మీకి భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఉపాధి కల్పించాలని తీర్మానించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ప్రభుత్వ సొంత గనులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అసంఘటిత కార్మికులకు నివాసం ఉన్న మురికివాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తీర్మానించి ఆమోదించారు.

సిఎం పర్యటన భద్రత కోసం

1180 మంది పోలీసులతో బందోబస్తు

- నేడు దరిశికి సిఎం జగన్మోహన్‌రెడ్డి రాక
- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కుమారుడు వివాహ రిసెప్షన్‌లో పాల్గొననున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-దరిశి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం దర్శిలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ కుమారుడు రాజీవ్-రోహితల వివాహ రిసెప్షన్‌లో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి పర్యటన భద్రత కోసం 1180 పోలీసులను నియమించారు. రిసెప్షన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్, ఎస్‌పి మల్లికాగర్గ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ కలిసి ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో పరిశీలించి.. ఏర్పాట్ల గురించి సమీక్ష చేశారు. శివరాజ్‌నగర్‌లోని ఎన్‌జిఒ కాలనీలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగే ప్రాంతాన్ని పరిశీలించి.. భద్రతా ఏర్పాట్లు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ ప్రాంతాన్ని, రూటు మ్యాప్‌ను పరిశీలించారు. వివాహ రిసెప్షన్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని, లోపలకు వచ్చే పోయే మార్గాలను, విఐపి వాహనాల పార్కింగ్‌లు, భోజన



సిఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్‌పితో చర్చిస్తున్న ఎమ్మెల్యే వేణుగోపాల్

ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీసులను ఎస్‌పి మల్లికగర్గ్ ఆదేశించారు. రిసెప్షన్ వేదిక వద్ద జబర్దస్త్ టీమ్ హైపర్ ఆది, బుల్లెట్ భాస్కర్, నరేష్, రాంప్రసాద్ సందడి చేయనున్నారు. కార్యక్రమాలలో మద్దిశెట్టి శ్రీధర్, మద్దిశెట్టి రవీంద్ర, జాయింట్ కలెక్టరు అభిషేక్ కిషోర్, అడిషనల్ ఎస్‌పిలు నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, డిఎస్‌పిలు వి.నారాయణస్వామిరెడ్డి, విశ్వనాథ్, మరియదాసు, నాగరాజు, మల్లిఖార్జునరావు,ఆర్‌డిఒ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తన కుమారుడు రాజీవ్-రోహితల వివాహ రిసెప్షన్‌కు వస్తున్న సందర్భంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ విలేకర్లతో మాట్లాడారు. దరిశి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమానికి వచ్చిన వారందరూ తమ ఆతిథ్యాన్ని స్వీకరించాలని కోరారు.

సక్రమంగా బాధ్యతలు నిర్వహించాలి

అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందరూ సక్రమంగా బాధ్యతలు నిర్వహించి.. విజయవంతం చేయాలని డిపిఒ నారాయణరెడ్డి కోరారు. దర్శిలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె కుసుమకుమారి పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు

న్యాయం జరిగేలా చూడండి

వ్యవసాయ, ఉద్యాన అధికారులకు మంత్రి సురేష్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పంట నష్టం అంచనాలు రూపొందించే క్రమంలో అర్హులైన రైతులందరికి న్యాయంజరిగేలా చూడాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇటీవల తుఫాన్ కారణంగా నష్టం వాటిల్లిన పంటల వివరాలను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వ్యవసాయ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సోమ వారం ఒంగోలు లోని క్యాంపు కార్యాలయంలో ఆయన వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షించారు. దెబ్బతిన్న పొగాకు, మిర్చి, వరి ఇతర పంటల వివరాలు, ఏఏ ప్రాంతాల్లో అధికంగా నష్టం వాటిల్లిందో తదితర సమాచారాన్ని అధికారులు వివరించారు. నష్టం అంచనాలు రూపొందించే క్రమంలో అర్హులైన రైతులందరికి న్యాయం జరిగేలా చూడాలని, క్షేత్రస్థాయిలో అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

పొలాలను సందర్శించి వివరాలు నమోదు చేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ అధికారి వై.గోపీచంద్ పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

- ముగ్గురికి కారుణ్య నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాపరిషత్‌లో ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన సిబ్బంది కుటుంబసభ్యులు ముగ్గురికి కారుణ్య నియామకంలో నియామక పత్రాలను ఆమె సోమవారం అందజేశారు. మండల ప్రజా పరిషత్ కార్యా లయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వారిని ఆఫీస్ సబార్డినెట్‌లుగా నియమించారు. కె.జయమ్మను సంత నూతలపాడు మండల ప్రజా పరిషత్‌లో, ఎన్.అభిషిక్త్‌ను యద్దనపూడి మండల ప్రజా పరిషత్‌లో, వై.పవన్ కుమార్ ను అనుమలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియమించారు. కార్యక్రమంలో జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.జాలిరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో

ఫీజులు వివరాలు వెల్లడించాల్సిందే..

బాలల హక్కుల కమిషన్ సభ్యుల ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని అన్ని ప్రైవేటు,కార్పొరేటు పాఠశాలల ప్రాంగణాలలో నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి, గొండు సీతారాం, టి.ఆదిలక్ష్మి, రాజేంద్ర ప్రసాద్ ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఒంగోలు పట్టణంలోని భాగ్య నగర్ 8వ లైన్ లోని రవీంద్ర భారతి స్కూల్, రామ్ నగర్ లోని భాష్యం స్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి విజయ భాస్కర్ తో కలసి వారు సందర్శించారు, అగ్ని మాపక యంత్రాలు, పిల్లలు ఆడుకోవడానికి గ్రౌండ్, మరుగు దొడ్లు, ప్రభుత్వ సెలవులు అమలుపై పూర్తి సమాచారం రాబట్టారు, ఆయా స్కూళ్ల ప్రాంగణాల్లో నోటీసు బోర్డ్ ల్లో ఫీజులను యుద్ధప్రాతిపదికన అతికింపజేశారు. అనంతరం సభ్యులు



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యులు

మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణకు తనదైన శైలిలో అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్రంలో బాలల హక్కులకు ఎక్కడ విఘాతం కలిగిన ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి బి.విజయభాస్కర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనలు ,ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు నోటీసు బోర్డుల్లో ఫీజులు వివరాలు అన్ని స్కూళ్ల లో బహిర్గతం చేసేలా ఆయా యాజమాన్యాలకు ఉత్తర్వులు జారీ చేస్తున్నామన్నారు,ఉత్తర్వులు అమలు జరపని స్కూళ్ల గుర్తింపు రద్దు చేయనున్నట్టు, వీటిపై నిరంతర ప్రక్రియ కొనసాగేలా తనిఖీల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్,ప్రమోద్ కుమార్, నీలిమ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.